

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు



సంపుటి : 13 | సంచిక : 12 | ఆగష్టు 2008



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-



చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥



పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


చించినాడ ........... 10-05-08

మల్కిపురం ........... 18-05-08

గణపవరం ........... 29-05-08



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 10-05-08, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శంకరజయంతి. మొదటి ఆచార్యుడు శంకరుడు, ఆయన విద్యాస్వరూపుడు, అనుగ్రహస్వరూపుడు, తేజోమయుడు, మహిమాన్వితుడు. శంకరుడు కర్ణాటకలోని కాలిడి గ్రామంలో శరీరం తీసుకొన్నాడు. శంకరుడి తల్లి ఆర్యాంబ, తండ్రి శివగురువు. వారికి చాలాకాలం సంతానం లేదు. ఒక బిడ్డను ప్రసాదించమని శివాలయానికి వెళ్లి ప్రార్థిస్తూ ఉండేవారు. ఒకనాడు శివగురువుకి శివుడు దర్శనమిచ్చి నీకు బిడ్డ కావాలి అంటున్నావు సామాన్యుడిగా ఉండి దీర్ఘకాలం జీవించేవాడు కావాలా? లేక సర్వజ్ఞుడై తక్కువ కాలం జీవించేవాడు కావాలా? అని అడుగుతాడు. దీర్ఘకాలం జీవించటం ఎందుకు తక్కువకాలం జీవించినా సర్వజ్ఞుడే కావాలని శివగురువు చెపుతాడు. అప్పుడు శివుడే శంకరుడిగా వచ్చాడు. మనకు సంబంధించినంతవరకు గురు పరంపరలో దక్షిణామూర్తి, శంకరుడు, రమణుడు. దక్షిణామూర్తి ఒక్కమాట మాట్లాడలేదు, పూర్తిగా మౌనం. ఆ మౌనభాష అర్థం చేసుకోగలిగినవారే ఆయన దగ్గరకు వెళ్లారు. శంకరాచార్యులవారి టైము వచ్చేటప్పటికి మౌనం విడిచిపెట్టేసారు, కాల ప్రవాహాన్నిబట్టి ఆయన చెప్పటం, వ్రాయటం, అనుగ్రహించటం. ఆయన కాలి నడకన భారతదేశాన్ని 3సార్లు చుట్టి బోధించారు. రమణుడిది దక్షిణామూర్తి పద్ధతికాదు, శంకరుడి పద్ధతీ కాదు. రమణుడు అటుఇటు కాకుండా కొంతవరకు మౌనంగా ఉండేవారు, అవసరమైనప్పుడు మాటలు చెప్పేవారు, ఆయనలో కొంతభాగం, ఈయనలో కొంతభాగం తీసుకొని రమణుడు వచ్చాడు.

శంకరుడికి 5వ సంవత్సరంలో తండ్రి స్వర్గస్థులయ్యారు. ఆయనకు 8 సంవత్సరాలు వచ్చేటప్పటికి వేదాలు, ఉపనిషత్‌లు అన్నీ చదవటం అయిపోయినాయి. శంకరుడికి గృహపరిత్యాగం చేసే టైము వచ్చింది. సన్యాసం తీసుకోవటానికి తల్లి అనుమతి అడిగాడు. తల్లి అంగీకరించలేదు. ఒకరోజు ఆయన పూర్ణానదిలో స్నానం చేస్తూ ఉండగా తల్లి గట్టుమీద కూర్చొంది. ఒక దొంగ మొసలి వచ్చి ఆయన కాలును పట్టుకొని లాగేయటం, గట్టు మీద నుండి తల్లి కేకలు వేయటం, అప్పుడు నేను సన్యాసం తీసుకోవటానికి నువ్వు అంగీకరిస్తేనే మొసలి వదిలిపెడుతుంది అని శంకరుడు తల్లితో చెప్పటం, తల్లి దానికి అంగీకరించటం అప్పుడు మొసలి విడిచిపెట్టిపోవటం జరిగింది, ఇది అంతా మాయ. ఆశ్చర్యం ఏమిటి అంటే ఒడ్డుకు వచ్చిన తరువాత ఆయన ఇంటికి వెళ్ళలేదు. జ్ఞాతులను పిలిచి తల్లిని జాగ్రత్తగా చూసుకొంటూ ఆస్తిని వారిని తినమని చెప్పాడు. నువ్వు చెప్పేది బాగానే ఉంది కాని నా శరీరం చనిపోయినప్పుడు నువ్వు వచ్చి కర్మకాండ చేయమని తల్లి అడిగింది. అది శంకరుడికి న్యాయం అనిపించింది. నీ శరీరానికి అవసాన కాలం వచ్చినప్పుడు శంకరా, శంకరా అని నన్ను స్మరించు నేను ఎక్కడ ఉన్నా వస్తాను అని తల్లికి చెప్పాడు. ఆయన గోవింద భగవత్‌పాదుల దగ్గర సన్యాసం పుచ్చుకొన్నారు. ఆయన అనేక గ్రంథాలు వ్రాసారు. ఆయన చెప్పినది ఏమిటి అంటే ఉన్నది ఒక్కటే వస్తువు, అదే బ్రహ్మం, అది తప్పించి అంతా మాయే. నీకు తెలుసున్నా నీవు బ్రహ్మమే, నీకు తెలియకపోయినా నీవు బ్రహ్మమే. ఆ బ్రహ్మానుభవం కలిగేవరకూ ఏ జీవుడిని మాయ విడిచిపెట్టదు. బ్రహ్మంకు భిన్నంగా నీవు ఏది చూసినా అది అంతా మాయే. బ్రహ్మానుభవం ఎలా పొందాలి అనేదే ఆయన గ్రంథాలలో వివరించారు, వాడు శంకరుడు. బ్రహ్మానుభవం పొందకుండా నీ శరీరం శవం అయిపోతే నీవు పొందే నష్టం ఇట్టిది అని ఎవరూ చెప్పలేరు అంటే అంత నష్టానికి గురి అవుతావు.

మీకు ఎప్పుడైనా కోపం వస్తుంది, దుఃఖం వస్తుంది, గర్వం వస్తుంది, రకరకాల గుణాలు వస్తాయి, అక్కడ ఆగిపోకూడదు. బ్రహ్మజ్ఞానం పొందటానికి నీవు ప్రయత్నం చేసేటప్పుడు అనేక ఆటంకాలు వస్తాయి, ఆర్థిక ఇబ్బందులు రావచ్చు, ఇంట్లోవారు శత్రువులు అవ్వవచ్చు, అనేకరకాల ఇబ్బందులు రావచ్చు, వీటన్నింటిని తట్టుకోగల శక్తి ఉంటేనే, అంత సహనం ఉంటేనే నీకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది కాని ఇది పాండిత్యంవలన, ధనంవలన వచ్చేదికాదు. గురువుగారు ఆచార్యులవారిని కాశీ వెళ్ళమని చెప్పారు, ఆయన కాశీ వెళ్ళారు. ఆయన ప్రచారం చేసినది అద్వైతం అంటే ద్వితీయం లేనిది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే రెండవది లేదు. మనం ద్వైతంలో నుండి ఎంతకాలం అయితే బయటకు రాలేమో అంతకాలం

మనకు భయం తప్పదు, కోరిక తప్పదు, కోపం తప్పదు, పునర్జన్మలు తప్పవు. నువ్వు జ్ఞాన మార్గంలో అయినా తరించవచ్చు, కర్మమార్గంలో అయినా తరించవచ్చు. కర్మయోగి అంటే వాడికి స్వార్థప్రేరితంగా ఆలోచనరాదు, స్వార్థప్రేరితంగా పనిచేయడు, వాడు కర్మయోగి. మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే బాహ్యంగా మీరు మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది కాని జ్ఞానం రాదు. చిత్తశుద్ధి లేకుండా జ్ఞానం రాదు. కోరికతోటి, కోపంతోటి, పబ్లిసిటీతోటి సంబంధం లేకుండా పని పనికోసమే చేసేవాడికి చిత్తశుద్ధి కలుగుతుంది. పుణ్యం చేసినవాడు నేను పుణ్యం చేసాను అనుకొంటాడు, పాపం చేసినవాడు నేను పాపం చేసాను అనుకొంటాడు, అలా ఎవరు అనుకొంటున్నారు, అలా అనేది వాడి అహంకారం, ఇంకవాడు మాయలో నుండి బయటకు రాలేడు, ఇది మహామాయ.

కలియుగంలో మాయ ఎక్కువగా ఉంటుంది. ఎర్రబట్టలు కట్టుకొనేవాడు ప్రతీవాడు గురువు అయిపోవాలి అనుకొంటున్నాడు. నేను సన్యాసిని, నేను గురువును, నేను ఉపనిషత్‌లు చెపుతాను అంటాడు. కాని అందరం ఎక్కడ మిస్సైపోతున్నాము అంటే హృదయంలో ఒక సత్యం ఉంది, దాని తాలుక అనుభవం మనకు లేదు, అది పొందటానికి కనీసం ప్రయత్నం కూడా చేయటం లేదు, దాని కోసం ప్రయత్నం చేయాలనే బుద్ధికూడా మనకు రావటం లేదు, పెద్దపెద్ద స్వాములు కూడా అలాగే ఉంటున్నారు. ఇదంతా ఎందుకు చెపుతున్నాను అంటే లోపల ఉన్న వస్తువును తెలుసుకోవాలి అని సన్యాసులు మరిచిపోయారు, మనం కూడా మరిచిపోయాము, అసలు గమ్యం పూర్తిగా వదిలేసాము. మీరు ఆ యజ్ఞం చేయండి మీ కోరిక నెరవేరుతుంది అని స్వాములు చెపుతున్నారు, మనం దాని గురించి లక్షలలో డబ్బు ఖర్చుపెడుతున్నాము, వాటి ద్వారా సంపాదన కోసం వారు చూస్తున్నారు. ఆచార్యులవారు చెప్పింది ఏమిటి అంటే మీరు బట్టకోసం, పొట్టకోసం ప్రజల మీద ఆధారపడవచ్చు కాని వారి దగ్గర నుండి మిగతావి ఏమీ ఆశించవద్దు, వారికి ధర్మాన్ని, జ్ఞానాన్ని బోధించండి అని చెప్పారు, దాని కోసమే ఆయన పీఠాలు స్థాపించారు. శంకరుడికి 16 సంవత్సరాలు వచ్చేటప్పటికి ఆయన ఆయుష్షు అయిపోయింది. అప్పటికే ఆయన రచనలు చేసారు. ఆ రచనలు నీవు దేశం అంతా తిరిగి ప్రచారం చెయ్యాలికదా, దేశం అంతా తిరిగి ప్రచారం చెయ్యటానికి ఇంకో 16 సంవత్సరాలు వయస్సు పెంచారు. మొత్తం శంకరుడు ఈ భూమి మీద ఉన్నది 32 సంవత్సరాలే. ఈ 32 సంవత్సరాలలో ఆయన మూడుసార్లు దేశం అంతా తిరిగి భోదించారు. ఆయన చెప్పిన ముఖ్యమైన విషయం ఏమిటి అంటే ద్వితీయం ఉన్నంతకాలం

భయం తప్పదు. నీకంటే వేరుగా ఏది కనిపించినా నీకు భయం వస్తుంది. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అదే నీకు లోకం అంతా కనిపిస్తుంది. లోపల ఉన్నదే బయట ఉంది. బయట ఉన్నదే లోపల ఉంది, అంతా ఒక్కటి అంటే ఒక్కటే అని నీకు తెలుస్తుంది. అప్పుడు భయం లేదు, కోరిక లేదు, కోపం లేదు, పునర్జన్మ లేదు, అదే చివరి స్థితి, అక్కడకు తీసుకొనివెళ్ళాడు, వాడు శంకరుడు.

మీరు చెడ్డగుణాలు తగ్గించుకోండి, మంచి గుణాలను పెంచుకోండి అని చెప్పటం దేనికి అంటే మంచి గుణాలు లేకపోతే మనస్సుకు అంతర్దృష్టి కలుగదు. ఒకసారి ఏసుక్రీస్తు దగ్గర ఆయన ఇన్నర్ సర్కిల్ 12 మంది కూర్చొన్నారు. అక్కడికి వచ్చినవారు ఏమన్నారు అంటే ఈ రోజు ఉపవాసం చేసేరోజు, మీరు ఉపవాసం చేయటం లేదు ఏమిటి అని అక్కడ ఉన్న భక్తులను అడిగారు, వారు ఏమీ మాట్లాడలేదు. ఏసుక్రీస్తు ఏమన్నారు అంటే పెళ్ళివారి ఇంటికి వెళ్ళి అక్కడ ఉన్నవారిని ఉపవాసం చెయ్యమంటే ఎలాగ ఉంటుందో ఇప్పుడు మీరు చెప్పేమాటలు అలాగే ఉన్నాయి అన్నారు. అంటే దాని అర్థం ఏమిటి అంటే పెళ్ళివారి ఇంటి దగ్గర ఉపవాసాలు ఎందుకు అలాగే అవతారపురుషుడి ఎదురుగా కూర్చొని వారికి ఉపవాసాలు ఎందుకు? అని చెప్పటం. ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఉండేవారు. వాళ్ళ అన్నగారు చనిపోయాడు. అన్నగారు అంటే వారికి చాలా ఇష్టం. ఒకసారి కాకతాళీయంగా ఏసు వారింటికి వెళ్ళాడు. ఆ అక్కాచెల్లెళ్ళు మా అన్నయ్య చనిపోయాడండి అని చెప్పి ఏడుస్తారు, మీతోపాటు నేను ఏడుస్తాను అని చెప్పి ఆయన కొంతసేపు ఏడుస్తాడు. తరువాత మీ అన్నగారి సమాధి దగ్గరకు తీసుకొని వెళ్ళమని అడుగుతాడు. వారి దుఃఖం చూసి ఏసు ఏమన్నాడు అంటే ఓ లజారస్, లజారస్ నువ్వు లోపల నుండి బయటకు రా అంటాడు, ఆయన బయటకు వస్తాడు. అప్పుడు ఏసు ఏమని చెప్పాడు అంటే చనిపోయిన వారిని బతికించటం నాకు ఉద్యోగం కాదు. మీ దుఃఖం భరించలేక నేనూ ఏడ్చాను, అయినా నాకు తృప్తి అవ్వటం లేదు అందుచేత మీ అన్నయ్యని మీకు ఇచ్చేస్తున్నాను అని చెప్పి అక్కడనుండి వెళ్ళిపోయాడు, వాడు ఏసు. లోపల ఉన్న సత్యానికి అత్యంత సమీపంలో ఉండేది సత్వగుణం, మిగతా గుణాలు స్వరూపానికి దూరంగా ఉంటాయి. ఏ గుణం అయితే సత్యానికి దగ్గరగా ఉంటుందో ఆ గుణాన్ని ఆశ్రయించి, ఆ గుణాన్ని పెంచుకొని సత్య పదార్థాన్ని పొందాలి.

శంకరుడు విద్యాస్వరూపుడు, ఆయనకు లోపలఉన్న సత్యవస్తువు తాలుక అనుభవం ఉంది. ఆయనకు చదువు అంటే ఇష్టం అలా గంటల తరబడి బోధించేవాడు. అనుభవం

ఉండటం, దానిని ఇతరులకు అర్థమయ్యేలాగ చెప్పగలగటం, చెప్పటానికి తగిన భాష ఇవి మూడూ ఉండటం కష్టం. ఇవి మూడూ ఉన్నవాడే శంకరుడు. వారు చెప్పిన మాటలు చదివేటప్పుడు అవి మనకు అబద్ధం కింద అనిపిస్తాయి ఎందుచేతనంటే జన్మాంతరంలో నుండి వచ్చిన వాసనలు, అలవాట్లు ఆ మంచిమాటలను నమ్మనివ్వవు. ద్వైతకర్మ జీవుడిని బంధిస్తుంది. అద్వైతకర్మ జీవుడిని బంధించదు. ఇతరులకు ఎవరికైనా సహాయం చేస్తే నేను వాడికి ఉపకారం చేసాను, నేను మంచి చేసాను అంటావు, అది ద్వైతకర్మ. మనం చేసేవి ద్వైతకర్మలు. నీకు నువ్వు ఎలాగ చేసుకొంటావో అలాగే ఇతరులకు కూడా చేయగలగాలి, అది అద్వైతకర్మ. ద్వైతకర్మలో ఉన్నంతసేపు నీవు బంధింపబడి తీరతావు, దీనిని ఎవరూ ఆపలేరు. లోపల మనస్సు ఉన్నంతసేపు మీరు అనుకోవటం మానరు, కర్మ చుట్టుకోవటం మానదు, ద్వైతం వచ్చాక పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం చుట్టుకొంటుంది. అమావాస్యరోజున మనకు చంద్రుడు కనబడడు అలాగని చంద్రుడు లేడు అని కాదు, మనకు కనబడటం లేదు అంతే. అలాగే మనలో జ్ఞానసూర్యుడు ఉన్నాడు. మనలో అజ్ఞానం ఉన్నంత కాలం లోపల ఆయన ఉన్నా మనకు గోచరంకాడు. జీవిత లక్ష్యం ఒక్కటే మనం ఏదో సాధన ద్వారా మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. నీకున్న సర్వశక్తులను, అవకాశములను కేంద్రీకరించి అజ్ఞానాన్ని పోగొట్టుకోవటానికి ప్రయత్నించు, మనం ఈ భూమి మీదకు వచ్చినపని అదే, వచ్చిన పని మరిచిపోవద్దు. ఇతరులను జయించటంకంటే మీ మనస్సును మీరు జయించటం కష్టం. ఇతరులకు మంచి చేయటంకంటే మీ మనస్సును మీరు నిగ్రహించుకోవటం కష్టం. బయట ఉన్న రాక్షసులను చంపటం తేలిక కాని లోపల ఉన్న రాక్షసులను చంపటం కష్టం. మీ లోపల అజ్ఞానరూపంలో రాక్షసులు ఉన్నారు. లోపల రాక్షసుల బారి నుండి మనం ఎలా బయట పడాలో నేర్పినవారే దక్షిణామూర్తి, శంకరుడు, రమణుడు మొదలగువారు. మనకు సన్మార్గం చూపించారు కాబట్టి వారు మహాత్ములు, వారు కూడా అవతారపురుషులే.

మన శరీరానికి ఏదైనా రోగం వస్తే బాధపడతాము, మనస్సులో బెంగవస్తే బాధపడతాము. వీటి అన్నింటికంటే మమకారం మనలను ఎక్కువ బాధ పెడుతుంది. అది తెలియక మనం బయట వారిని తిడుతూ ఉంటాము. తలంపులు మమ్మల్ని ఎక్కువగా బాధ పెడుతున్నాయి అని అడుగుతున్నారు. జీవితం అంతా తలంపులే. శరీరానికి సంబంధించిన చావు, పుట్టుక, నీ సంతోషం, దుఃఖం, నేను మంచివాడిని, నేను చెడ్డవాడిని అని అనుకోవటం ఇవి అన్నీ తలంపులే. ఒక్క బ్రహ్మం తప్పించి ప్రతీదీ తలంపే. మనం ఏమి చెయ్యాలి అంటే ఆత్మలో మన మనస్సును

నిలబెట్టి ఉంచితే, దానియందు నీకు ప్రీతి కలిగితే ఈ తలంపులు అన్నీ పోతాయి. బ్రహ్మం యొక్క విలువ మనకు తెలిస్తే మనస్సు అక్కడకు వెళ్ళి వాలుతుంది. బ్రహ్మం యొక్క విలువ మనకు తెలియటంలేదు, బ్రహ్మానుభవం పొందితే మనం మాయలోనుండి బయటకు వచ్చేస్తాము అన్న సంగతి మనకు తెలియటం లేదు. అందుచేత మనం పనికిరానివి అన్నీ పట్టుకొంటున్నాము, అసలు వస్తువును మిస్ అయిపోతున్నాము. అది మిస్ అవ్వకుండా ఉండటంకోసం, బ్రహ్మం యొక్క విలువ మనకు తెలియజేయటం కోసం శంకరుడు అనేక గ్రంథాలు వ్రాసాడు, రోజుల తరబడి సబ్జక్టు భోదించాడు.

మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా న్యూట్రల్‌గా ఉండటం నేర్చుకోండి. అప్పుడు మీరు సమానంగా ఉండగలిగితే మీకు లోపలకు వెళ్ళేదారి కనబడుతుంది. సృష్టి అంతా భగవంతుడే వ్యాపించి ఉంటే ఇంక నువ్వు సంతోషించేది దేనికి, దుఃఖపడేది దేనికి? సత్యవస్తువు ఎలా ఉండాలో అలా ఉంది, దానికి తలంపులు లేవు. అందుచేత దాని గురించి ఊహించవద్దు, అది ఎలా ఉందో అలా ఉండటానికి ప్రయత్నం చెయ్యి, అది అవ్వటానికి ప్రయత్నం చెయ్యి. ఒకో తలంపును మీరు గెంటుకోవాలన్నా అది వెళ్ళదు, అదే తలంపు వచ్చేస్తోంది ఏమిటి అని మీరు అనుకొంటారు దీనికి ఉపాయం ఒకటి ఉంది. మీకు ఇష్టమైన దేవతారూపాన్ని లేక గురువును తీసుకొని దానిమీద మీరు బాగా ఇష్టాన్ని పెంచుకోండి. ఆ దేవతాపురుషుడి రూపాన్ని లేక గురువు రూపాన్ని ధ్యానించుకోండి, ఆయన నామాన్ని స్మరించుకోండి, ఆ కళ్యాణగుణాలను మననం చేసుకోండి, అప్పుడు మీ రూపం నుండి, నామం నుండి నెమ్మదిగా బయటకు వచ్చేస్తారు, అప్పుడు తలంపులు రావటం తగ్గిపోతాయి. అయితే ఒకటి గుర్తు పెట్టుకోండి. మీ ఇష్ట దైవం మీద లేక గురువు మీద మీకు మినహాయింపులు లేని శరణాగతి ఉండాలి. ఆయన ఇష్టమే నా ఇష్టం, ఆయన సంకల్పమే నా సంకల్పం అని మీరు అనుకొంటే అప్పుడు ఇతర తలంపులు రావు సరికదా మనస్సు నెమ్మదిగా అణిగిపోతుంది, మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. అయితే ఆ దేవతా పురుషుడిమీద, గురువు మీద మీకు పరిపూర్ణమైన నమ్మకం ఉండాలి. వాడు మనలను రక్షిస్తాడు, మన రక్షకుడు వాడే అనేటువంటి విశ్వాసం ఉండాలి. ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. దేవతాపురుషుడి మీద మీకు ఇష్టం ఉంటే ఎంతసేపు ఆ నామాన్ని స్మరించినా మీకు కష్టం అనిపించదు. అందుచేత మనకు ఎంత కష్టమైన పని అయినా ఇష్టంగా చేస్తే కష్టం కింద అనిపించదు. మనం ఇతరుల గొడవలలోనికి వెళ్ళకూడదు. ఇతరుల గొడవలలోనికి వెళితే మనకు తెలియకుండా మనస్సు పెరిగిపోతుంది, మనం దేనినైతే వదిలించుకోవాలి

అనుకొంటున్నామో అది పెరిగిపోతుంది, అది పెరిగిపోతూ ఉంటే తలంపులు కూడా పెరిగిపోతాయి.

శరీరానికి వచ్చే రోగాలకంటే, ప్రకృతి తీసుకొనివచ్చే ఇబ్బందులకంటే, సమాజం తీసుకొని వచ్చే గొడవలకంటే అన్నింటికంటే మన మమకారమే మనలను ఎక్కువ బాధపెడుతుంది. మమకారం మనలను బాధపెట్టినట్లుగా ప్రపంచంలో ఏదీ మనలను బాధపెట్టదు. మీ చెయ్యి నిప్పు మీద పెడితే దాని యొక్క మంట ఎలా ఉంటుందో అలాగే మమకారం ఉంటే మనస్సుకు అంతమంట పుడుతుంది. దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన ఈ మూడువాసనలు మనిషిని పట్టుకొని పీడిస్తున్నాయి. ఎవడైతే ధైర్యంతోటి ఈ మూడు వాసనలను విడిచిపెట్టగలిగాడో, ఈ మూడువాసనలను త్యాగం చేయగలిగాడో వాడు ఆత్మనిష్టుడు అవుతాడు. నీ కళ్లకు కనిపిస్తున్న ఈ ప్రపంచంలో నువ్వు సంతోషించటానికి ఏమీ లేదు, దుఃఖపడటానికి ఏమీ లేదు నువ్వే కల్పించుకొని సంతోషిస్తున్నావు, కల్పించుకొని దుఃఖపడుతున్నావు, ఇవన్నీ నీ తలంపులే అన్నారు ఆచార్యులవారు. శంకరాచార్యులవారు గంటల తరబడి సబ్జక్టు బోధించేవారు దానికి కారణం ఏమిటి అంటే మీకు సబ్జక్టు మీద ప్రీతి కలగాలి. మీకు దాని మీద ఇష్టం కలిగితే దానిని పొందటానికి మీరే ప్రయత్నం చేస్తారు. మీకు సబ్జక్టు ముఖ్యం, ఆలోచన ముఖ్యం, మిగతా గొడవలు అనవసరం. మనం పెద్దవారిని మరిచిపోతున్నాము. మనం మహాత్ములను జ్ఞాపకం పెట్టుకోవాలి. శంకరుడు, రమణుడు వీరిని స్మరించుకోవటం పుణ్యం, వారిని జ్ఞాపకం పెట్టుకోవటం పుణ్యం, వారికి నమస్కారం పెట్టుకోవటం పుణ్యం. శంకరుడు, రమణుడు, దక్షిణామూర్తి ఏది చెప్పినా దాని తాలుక అనుభవం పొంది, లోపల ఆ వస్తువును దర్శించే చెప్పారు కాని ఏదో మనలను సంతోష పెట్టటానికి, మన అహంకారాన్ని ఉబ్బించటానికి చెప్పిన మాటలు కాదు, వారు పొందిన అనుభవాన్ని మనకు అందించారు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 18-05-08, మల్కిపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గౌతమబుద్ధుడు పుట్టినరోజు, ఆయనకు జ్ఞానం వచ్చినరోజు, ఆయన శరీరం విడిచిపెట్టినరోజు ఒకటేరోజు. వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున ఆయన శరీరం పుట్టింది, మరల అదేరోజున ఆయనకు జ్ఞానం కలిగింది, ఆయన శరీరం విడిచిపెట్టిన రోజు కూడా వైశాఖశుద్ధ పౌర్ణమియే. ఈ భూమి మీద మనుషులు పుట్టటం ప్రారంభించాక బుద్ధుడులాంటి పెద్దమనిషి,

ఆయనలాంటి మర్యాదస్తుడు పుట్టలేదు అని ఠాగూర్ చెప్పాడు. పాపం ఎలా ఉంటుందో, దోషం ఎలా ఉంటుందో, బలహీనత ఎలా ఉంటుందో, స్వార్థం ఎలా ఉంటుందో తెలియని మనిషి బుద్ధుడు అని ఠాగూర్ అన్నారు. ఇతరులు బాధపడినా పరవాలేదు మనం సుఖండా ఉండాలి అని మనం అనుకొంటాము కాని బుద్ధుడి మనస్సు ఎటువంటిది అంటే ఆయన బాధపడినా ఫరవాలేదు పదిమంది సుఖపడితే సరిపోతుంది అనుకొంటాడు. దేవుడి గొడవ మీకు వద్దు. దేవుడు ఉండవచ్చు, లేకపోవచ్చు. ముందు మీరు బాగుపడే విధానం చూసుకోండి. ఎవరోవచ్చి మిమ్మల్ని బాగుచేస్తారని కనిపెట్టుకొని ఉండవద్దు. మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోవాలి. మిమ్మల్ని చూసి మీరు జాలిపడకండి. మేము కష్టపడిపోతున్నాము, మమ్మల్ని ఎవరూ పట్టించుకోవటంలేదు అని చాలామంది చెపుతూ ఉంటారు. వారినిచూసి వారే జాలిపడుతూ ఉంటారు. అది మంచిదికాదు. ఇతరుల మీద జాలి చూపించవచ్చు కాని మీ మీద మటుకు మీరు జాలి చూపించవద్దు అని చెప్పాడు. ఇతరుల గొడవ మీకు వద్దు. నూటికి నూరుపాళు మీ మనస్సును పవిత్రం చేసుకొన్నారో లేదో చూసుకోండి, మీరు విద్య సంపాదించేటప్పడు, ధనం సంపాదించేటప్పడు రకరకాలుగా ఎలా కృషి చేసుకొంటున్నారో అలాగే మీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి అన్నివిధాలుగా కృషి చేసుకోండి. ఒకరకంగా కనుక మీరు బాగుపడటానికి ప్రయత్నం చేసి మిగతా రకాలు అన్నీ గాలికి వదిలేస్తే మీరు బాగుపడరు.

మీరు చేసేపని శుద్ధంగా ఉండాలి, నోరు శుద్ధంగా ఉండాలి, మీకు వచ్చే తలంపులు శుద్ధంగా ఉండాలి. మీరు చేసే పని ఎంత పవిత్రంగా ఉండాలో మీ మాట కూడా అంత పవిత్రంగా ఉండాలి. మన ప్రవర్తన ఎలా ఉందో ఏ రోజుకారోజు చూసుకోవాలి మన స్నేహాలు ఎలా ఉన్నాయో జాగ్రత్తగా చూసుకొంటూ ఉండాలి. మీ స్నేహాల వలన మనస్సు పవిత్రం అవుతోందా లేక అపవిత్రం అవుతోందా అని జాగ్రత్తగా చూసుకోవాలి. మీ మనస్సు బాగుపడటానికి ఎన్ని రకాలుగా ప్రయత్నం చేయాలో అన్ని రకాలుగా మీరు ప్రయత్నం చేస్తేనే మనస్సు పవిత్రం అవుతుంది, మీకు జ్ఞానం కలుగుతుంది కాని ఏదో ఒకరకంగా ప్రయత్నం చేస్తున్నాము అంటే ఇది కలుగదు. భగవంతుడు మనకు ఈ శరీరాన్ని ఇచ్చాడు. అందుచేత శరీర ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకొంటూ ఈ శరీరాన్ని సాధనకు ఉపయోగించుకోవాలి. సాధకుడికి భోగప్రవృత్తి ఉండకూడదు. మీ మనస్సు మీ స్వాధీనంలో ఉంటే మీకు వేలాది మంది విరోధులు ఉన్నా ఇబ్బంది లేదు. మీ మనస్సు మీ స్వాధీనంలో లేనప్పడు మీకు వేలాది మంది స్నేహితులు ఉన్నా వారి వలన మీకు ఉపకారం ఏమీ లేదు. అందుచేత మీ మనస్సును నియమించుకోవటానికి,

దానిని సమానంగా ఉంచుకోవటానికి ముందు మీరు ప్రయత్నం చేయాలి. వారు మంచి వారు, వీరు చెడ్డవారు, వారు స్నేహితులు, వీరు విరోధులు అని యిలా మనుషులను విడగొట్టుకోవద్దు అని చెప్పాడు, ఇదంతా అజ్ఞానం అంటున్నాడు. మీకు వారి స్నేహాలు నచ్చకపోతే దూరంగా ఉండండి అంతేగాని వారితో విరోధాలు పెట్టుకోవద్దు. స్నేహాలు అతిగా పెట్టుకోవద్దు, దాని వలన మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది.

లోకంలో మీరు ఏదైనా పని చేస్తూ ఉంటే మీరు పని చేస్తూ ఉండాలి, మనిషి తెరమీద కనబడకూడదు. మనం ఇంట్లో ఏదైనా వస్తువును చూసుకోవటానికి దీపం పెట్టుకొని చూసుకొంటాము అలాగే మీరు ఏదైనా పనిచేసేటప్పుడు ఇది మంచా, ఇది చెడ్డా, ఇది మనకు ఉపకారం చేస్తుందా లేక అపకారం చేస్తుందా అని జ్ఞానం అనే దీపంతోటి చూసుకొని ఆ పని చెయ్యాలి, ఏ రోజుకారోజు మీరు వాచింగ్‌లో ఉండాలి. నీ మనస్సులో వచ్చే కెరటాలు చూసుకోవాలి. నీకు ఏదైనా అశాంతి వస్తోంది అనుకో, అశాంతి ఎందుకు వస్తోందో చూసుకోవాలి. నీకు ఎక్కడో మమకారం ఉండవచ్చు. మీరు డ్యూటీ చేయండి అంతేగాని ఎవరిమీద మమకారం పెట్టుకోవద్దు. మీకు మమకారం లేదు అనుకోండి మీకు అశాంతి రాదు, బంధం రాదు. మీకు లోకవాసన ఉన్నంతకాలం, మీకు భోగవాంఛ ఉన్నంతకాలం పునర్జన్మ వచ్చి తీరుతుంది. భోగప్రవృత్తిని సంతృప్తిపరచు కోవటానికి ఈ దేహాన్ని ఉపయోగించుకోవద్దు, ఆత్మజ్ఞాన సముపార్జనకోసం ఈ దేహాన్ని ఉపయోగించుకోండి అప్పుడు మీ దేహం దేవాలయం అవుతుంది. అప్పుడు ఈ దేహంతో సంబంధం లేని సుఖం మీకు తెలుస్తుంది. అటువంటి సుఖంలో, ఆనందంలో మునకలు వేస్తున్నప్పుడు ఇంక మీకు పునర్జన్మ లేదు. ద్వైతబుద్ధి పనికిరాదు. పని పనికోసమే చెయ్యి, ఏదో ప్రయోజనం ఆశించి పని చేస్తావు అనుకో నీకు తెలియకుండా లోపల స్వార్థం పెరిగిపోతుంది, వేరుభావన పెరిగిపోతుంది. వేరుభావన పెరిగినప్పుడు గుర్తింపులు కావాలి, గుర్తింపులు వచ్చేకొలది మనస్సు పెరిగిపోతుంది.

బుద్ధుడు త్యాగానికి ప్రతీక. ఆయన ఒక మహాసామ్రాజ్యాన్ని విడిచిపెట్టాడు అయినా ఒక రాజ్యాన్ని విడిచిపెట్టేసి మనం బయటకు వచ్చాము అని ఆయనకు జీవితంలో తలంపు రాలేదు. మనం ఎవరికైనా వంద రూపాయలు చందా ఇస్తే అది రోజూ జ్ఞాపకం వస్తుంది. చనిపోయేటప్పుడు కూడా మనకు రాముడు జ్ఞాపకం రాడు ఆ వంద రూపాయల చందా జ్ఞాపకం వస్తుంది, మనం అంత పాడైపోయాము. బయటకు ఏదో మొఖానికి పౌడరు వ్రాసుకొని, మంచి బట్టలు వేసుకొని తిరుగుతున్నాము కాని లోపల శుభ్రంగా కుళ్ళిపోతున్నాము. నీ స్వార్థం

కోసం లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నావు, అప్పుడు త్యాగం చేసాను అని అనుకోవు. ఎవడికో వంద రూపాయలు ఇచ్చి పెద్ద త్యాగం చేసాను అంటావు, అదే జ్ఞాపకం పెట్టుకొంటావు. ఇంత పాడుబుద్ధి ఉన్న మనకు ఇంక జ్ఞానం ఏమిటి? మన కేసులు బాగా ముదిరిపోయాయి. ఆయన కొడుకు వచ్చి సన్యాసం ఇమ్మని అడిగితే నువ్వు సన్యాసం అడుగుతున్నావు, ఆ రాజ్యం అంతా ఏమైపోతుంది, నువ్వు వారసుడివి కదా, ఆ రాజ్యాన్ని పాలించుకో అని ఆయన చెప్పలేదు, సన్యాసం తీసుకో అని చెప్పాడు, వాడు బుద్ధుడు. ఆయన పొందింది 40 సంవత్సరాలు దేశానికి పంచిపెట్టాడు. ఆయన ఇంటింటికి తిరిగి భోదించాడు, మిమ్మల్ని బాగుచేయటంకోసం మీ ఇంటికి వచ్చి భోదించాడు, వాడు బుద్ధుడు. మిమ్మల్ని దుఃఖం లేని స్థితికి తీసుకొనివెళ్ళటానికి, అశాంతి ఎలా ఉంటుందో తెలియనిస్థితికి తీసుకొని వెళ్ళటానికి 40 సంవత్సరాలు ప్రతీ ఊరికి వెళ్ళి భోదించాడు, వాడు బుద్ధుడు. మనుషులు ఈ భూమి మీద పుట్టటం ప్రారంభించాక అంతటి కరుణామయుడు ఈ భూమి మీద తిరగలేదు అన్నాడు ఠాగూర్. ఆయన పాపరహితుడు, పరమపవిత్రుడు. బుద్ధుడి కూడా ఆయన సవతి తమ్ముడు ఆనంద్ ఉండేవాడు. బుద్ధుడి శరీరం విడిచిపెట్టేటప్పుడు ఈ శరీరాన్ని ఏమి చేయమంటారు అని ఆనంద్ అడుగుతాడు. బుద్ధుడు ఏమి చెప్పాడు అంటే ఇప్పుడు మనం ఉన్నది ఒక ఊరు కదా. ఈ గ్రామంలో అందరి శవాలను ఏ స్మశానంలో అయితే దహనం చేస్తున్నారో ఈ శరీరాన్ని కూడా అక్కడ దహనం చేయండి. అంతేగాని బుద్ధుడు ఫలానాచోట చనిపోయాడు, ఆయన శరీరాన్ని ఫలానాచోట దహనం చేసారు అని లోకానికి గుర్తుకూడా అక్కరలేదు అని చెప్పాడు, వాడు బుద్ధుడు.

బుద్ధుడిలో మనం నేర్చుకోవలసినవి ఏమిటి అంటే ఆయనలో స్వార్థం లేదు, వేరు భావన లేదు. మీ మనస్సులో నుండి వేరుభావనను, స్వార్థాన్ని తీసేయండి. మీ కుడిచేయి ఎడమచేయికి ఏదైనా పండు ఇచ్చింది అనుకోండి, ఎవడికో దానం చేసాము అని అనుకోము ఎందుచేతనంటే రెండు చేతులు మనవే, అలాగే ఇతరులకు ఏదైనా ఇచ్చేటప్పుడు కూడా ఆ భావన ఉండాలి, అప్పుడు మనం పవిత్రులం అవుతాము, ఆ స్థితిని పొందమని బుద్ధుడు చెపుతున్నాడు, సమాజానికి మీరు ఏదైనా ఉపయోగపడినా వేరుభావనతో చెయ్యవద్దు, అలా చేస్తే సమాజానికి ఏదైనా మంచి చేస్తున్నట్లు మీకు అనిపించినా లోపల కుళ్ళిపోతారు, అదీ బుద్ధుడు చెప్పేది, మీకు మీరే సాక్షి. మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోండి. మీ మనస్సును బాగుచేసుకోవటానికి, మీ మనస్సును పవిత్రం చేసుకోవటానికి ఏకాగ్రత సంపాదించండి. ఏకాగ్రత సంపాదిస్తే అన్నీ వచ్చేస్తాయి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఈ సృష్టిని

అంతా ఆయనే నడుపుతున్నాడు, మన చేతిలో ఏమీలేదు, మనం ఊరికే కీలుబొమ్మలము, ఆయన ఎలా ఆడిస్తే అలా ఆడవలసిందే. పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని హృదయపూర్వకంగా నమ్మి ఆయనకు శరణాగతి చేయటం వలన అహంభావన నశిస్తుంది. అది ఒక పద్ధతి. నేను అనే తలంపు మనకు తెలుస్తోంది కదా, అది మన లోపలనుండే వస్తోంది, ఆ తలంపు ఎక్కడనుండి వస్తోందో అంతదూరం లోపలకు వెళ్ళి అక్కడ మునిగినా ఆ తలంపు నశిస్తుంది, అప్పడు లోపల ఉన్న బ్రహ్మపదార్థం నీకు తెలుస్తుంది.

ఒకసారి రామకృష్ణుడు మహేంద్రనాథ్‌గుప్తాతో అంటాడు మీరు ఏదైనా పని మొదలుపెట్టారు అనుకోండి ఆ పని మీ తెలివితేటల వలన అవ్వదు. ఒకవేళ మీరు తెలివి తక్కువవారు అయినా ఆ పని ఆగదు. సర్వేశ్వరుడు ఒకడు ఉన్నాడు, ఆయనే మన అందరికి యజమాని. ఆయన ఊ అంటే ఆ పని అయిపోతుంది, ఆయన వద్దు అంటే ఆ పని ఆగిపోతుంది, ఒకవేళ మీరు వెయ్యికోట్లు డబ్బు ఖర్చుపెట్టినా ఆ పని అవ్వదు, మీరు ఓడిపోతారు. మీరు అందరూ ఏమనుకొంటున్నారు, మేము కష్టపడి ఈ పని సాధించాము అనుకొంటున్నారు. కొంతమంది ఏమంటారు అంటే మేము ఎక్కడికి వెళ్ళినా పనులు అవ్వటంలేదు, ఎటువెళ్ళినా శనిగాడు ఎదురు వస్తున్నాడు అంటారు. ఇవన్నీ నిజాలు కాదు. పని అయిన వారు అందరూ తెలివైన వారు కాదు, పని అవ్వనివారు తెలివితక్కువవారు కాదు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఆయన సంకల్పానికి భిన్నంగా మీ వల్ల ఏమీ అవ్వదు అది రామకృష్ణుడు చెప్పేది, నీ దేహం ఈ భూమి మీదకు వచ్చినప్పడే ఆ దేహం ద్వారా ఏమి జరగాలో నిర్ణయింపబడి ఉంటుంది. దానికి ఫుల్‌స్టాఫ్, కామా అటు ఇటు కదలకుండా ఆ దేహయాత్ర అలా నడిచిపోతుంది. ఈలోపుగా మనం 90 ప్రణాళికలు వేసుకొన్నా అవి జరగవు. అసలు దేవుడి ప్రణాళికలో ఉంటే మీ ఆలోచనలతో సంబంధం లేకుండా అది జరిగిపోతుంది. దేవుడి ప్రణాళికలో లేదు అనుకోండి మీరు తలకాయపోటు వచ్చేవరకు ఆలోచించినా అది అవ్వదు. నీ మనస్సు గుల్ల అయితే నీ శరీరాన్ని భగవంతుడు స్వాధీనం చేసుకొంటాడు. ఎవడైతే తన శరీరాన్ని, మనస్సును, వాక్కును దేవుడికి అర్పించాడో, వాటిని భగవంతుడి సంకల్పానికి అనుకూలంగా తిప్పాడో వాడి శరీరాన్ని ఆయన స్వాధీనం చేసుకొని వాడిద్వారా ఆయన పని చేస్తూ ఉంటాడు, వారినే దేవుడి సేవకులు అంటారు.

సొమ్ము అంతా ఈశ్వరుడిదే. ఆ దేహప్రారబ్ధాన్ని బట్టి ఎంత అవసరమో అంత కేటాయిస్తాడు. నీ ప్రారబ్ధాన్నిబట్టి ఏది ఇస్తే అది భగవంతుడి ప్రసాదం అనుకోవాలి. అది

ఎక్కువ అనుకోవద్దు, తక్కువ అనుకోవద్దు, ఇచ్చినదానితో సంతృప్తిపడాలి. అలా నువ్వు సంతృప్తిపడితే భగవదనుభవం పొందటానికి నీ మనస్సును ప్రిపేర్ చేస్తాడు. ఒకోసారి మీరు అనుకొన్నదానికంటే ఎక్కువ ఇచ్చేస్తాడు. అప్పుడు మీకు గర్వం వచ్చేస్తుంది. అసలు మీకు లోపల గర్వం ఉందో లేదో మీకు తెలియటానికి అలా చేస్తున్నాడు, అది మీకు తెలియక నాకేదో వచ్చేసింది అనుకొంటారు. నాకు దుఃఖం రాకూడదు, నేను సంతోషంగా ఉండాలి అని ప్రతీ మనిషికి ఇదే గొడవ. దుఃఖం రాకుండా ఉండటంకోసం, సంతోషంగా ఉండటం కోసం ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. దుఃఖం, సంతోషం ఈ సంకల్పాలను వదిలేయండి. ఇష్టాలు, అయిష్టాలు పడేవాడు ఒకడు నీలోపల ఉన్నాడు. వాడి స్థానంలో దేవుడిని కూర్చోబెట్టండి. దేవుని ఇష్టమే మీ ఇష్టం, ఆయన అయిష్టమే మీ అయిష్టం చేసుకోండి. మీ ఇష్టాలు, అయిష్టాలు వదిలేయండి. మీకు సొంతసంకల్పం అంటూ ఏమీ ఉండకూడదు. మనందరిలో బలహీనత ఎక్కడ ఉంది అంటే మనకు కోరిక లేకపోతే, సంకల్పం లేకపోతే ఆ పని అవ్వదేమో అని అనుకొంటాము. అసలు పని అవ్వటానికి నీ కోరికకు, నీ ఆలోచనకు, నీ సంకల్పానికి ఏమీ సంబంధం లేదు అని మనకు తెలియటం లేదు, అందుచేత అశాంతి వస్తోంది. దేవుని సంకల్పానుసారం అది అవ్వవలసి ఉంటే మన కోరికతోగాని, మన ప్రయత్నంతోగాని సంబంధం లేకుండా అయిపోతుంది. దేవుడు కనుక కాదు అంటే మనకు ఎన్నిసార్లు సంకల్పాలు వచ్చినా, ఎంత ప్రయత్నం చేసినా అది అవ్వదు అన్న సంగతి మనకు తెలియటంలేదు. ఈ సబ్జక్టు అర్థమైతే మనకు శరణాగతిభావన వస్తుంది. శరణాగతిభావనలో మీకు తెలియకుండా మనస్సు నశిస్తుంది, మీకు భగవదనుభవం కలుగుతుంది. ఆ స్థితిలో మీరు స్నేహితులను చూసినా విరోధులను చూసినా కూడా మీకు ఏమీ అనిపించదు, ఈ స్నేహితులు, విరోధులు నిత్యం కాదు, ఇది అంతా ఒక లీల అని మీకు తెలుస్తూ ఉంటుంది.

మీరు చేసే కర్మ హృదయపూర్వకంగా చేయాలి, ఫలకాంక్ష ఉండకూడదు. ఫలకాంక్ష లేకపోయినా వచ్చేది వస్తుంది ఫలకాంక్ష ఉన్నా రానిది ఎలాగూరాదు. ఫలకాంక్ష లేకుండా మీరు పనిచేస్తూ ఉంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు, శరణాగతి భావన పెరుగుతుంది, మీకు జ్ఞానం కలుగుతుంది. భోగ ప్రవృత్తి ఉన్నవాడే కర్మఫలాన్ని కోరుకొంటాడు, భోగప్రవృత్తి లేనివాడికి కర్మఫలం వచ్చినా అది పెద్ద సంతోష కారణం అవ్వదు. మీరు స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మీరు చేసే స్నేహాలవలన మీకు వివేకం పెరగాలి, విద్య పెరగాలి. భగవంతుడి పట్ల మీకు ఉన్న విశ్వాసం పెరగాలి, అటువంటి స్నేహాలే చేయండి. ముళ్ళ చేపలవంటి

మనుషులు ఉంటారు జాగ్రత్తగా ఉండు అని రామకృష్ణుడు చెప్పేవారు. ఏదో మాంసం ఉంటుందని కష్టపడి ముళ్ళు ఏరుకొని తిందామంటే పెద్ద మాంసం ఏమీ అక్కడ ఉండదు, అలాగే మీకు ఏదో ఆశ ఉంటుంది కదా ఆ మనుషుల చుట్టూ తిరుగుతూ వారిని నాకుతూ ఉంటే నీ నాలుకకు నొప్పిగాని వారి దగ్గరనుండి వచ్చేది ఏమీ ఉండదు. నువ్వు చేసేది త్రికరణశుద్ధిగా చెయ్యి. ఇది భౌతికం, ఇది ఆధ్యాత్మికం అంటూ వేరుగా ఏమీ లేదు. గుడికి వెళ్ళి అక్కడ పువ్వులు పెట్టి, హుండీలో డబ్బులు వేసి అది ఆధ్యాత్మికం అనుకొంటున్నావు. ఇతరులకు ఏదైనా ఇస్తే అది ఉపకారం అనుకొంటున్నావు, అది భక్తి కాదు అనుకొంటున్నావు. ఇది కూడా భక్తే. ఇలా విడదీసుకోవటానికి దేహగతమైన నేను కారణం. అసలు భౌతికం అనేది లేదు, అంతా ఆధ్యాత్మికమే. నీకు దేహబుద్ధి ఉంది, కాబట్టి ఇది భౌతికం కింద నీకు అనిపిస్తోంది. నీకు దేహభావన పోతే అంతా చైతన్యమే అనే అనుభవం కలుగుతుంది.

గుడిలో ఉన్న వెంకటేశ్వరస్వామిని చూస్తున్నావు, ఆయనే మీ దేహంలో కూడా ఉన్నాడు కాని దేహంలో ఉన్న వెంకటేశ్వరస్వామిని నువ్వు చూడలేకపోతున్నావు. మనిషిలో కూడా దేవుడు ఉన్నాడు వాడు నీకు కనబడకపోవటానికి కారణం వాడు లేకపోవటం వలన కాదు. నువ్వు లోపల శుభ్రంగా కుళ్ళిపోయి ఉన్నావు. సూర్యుడు ఉన్నా గుడ్డివాడికి కనబడడు అలాగే మనిషిలో కూడా దేవుడు ఉన్నా నీ అజ్ఞానం వలన ఆయన నీకు కనబడటం లేదు, అందువలన వాడు ఎల్లయ్య అని, పుల్లయ్య అని అనుకొంటున్నావు. గుడిలో ఉన్న దేవుడిని చూడటమేకాని మనిషిలో ఉన్న దేవుడిని చూడటం మనకు చేతనవ్వటంలేదు, ఇది చేతకాకపోతే నేర్చుకోవయ్యా అంటున్నారు. చంటిపిల్లలకు అన్నం తినటం చేతకాదు కాని మీరు నేర్పుతున్నారు కదా, అలాగే మనిషిలో ఉన్న దేవుడిని చూడటం నేర్చుకోవయ్యా అది నేర్చుకొంటే ఇతరులకు ఉపకారం చేసాను అనే బుద్ధి నీకు రాదు, ఇతరులకు ఏదైనా చేసినా అది కూడా పూజ అనుకొంటావు, పుణ్యం కూడా ఆశించవు, నీవు కల్పించుకొన్నదంతా నశిస్తుంది, అప్పుడు నీవు పవిత్రుడవు అవుతావు.

మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే కపటం పనికిరాదు. రామకృష్ణుడికి సంతకం పెట్టటం రాదు అయినా అంత అభివృద్ధిలోనికి వచ్చాడు ఎందుకు అంటే కపటం అంటే ఎలా ఉంటుందో ఆయనకు తెలియదు. రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే ఎంతసేపు పండితులు విచారణ చేసుకోండి, విచారణ చేసుకోండి అంటారు వారిని విచారణ చేసుకోనివ్వండి, మీకు ఎవరికైనా ఇష్టమైతే మీరు కూడా విచారణ చేసుకోండి, అది ఒక్కటే

మార్గం అని మీరు అనుకోవద్దు అని చెప్పాడు. మీకు నచ్చిన మార్గంలో, మీకు తేలికగా ఉన్న మార్గంలో ఏదైతే ప్రేమపూరితంగా ఉందో ఏదైతే సేఫ్‌గా ఉందో ఆ మార్గంలో ప్రయాణం చేయండి, భగవంతుడిలో ఐక్యం అవ్వటం ముఖ్యం. ఉన్నది ఆయన ఒక్కడే, అసలు మనం అంటూ లేము. ఇంతవరకు భగవంతుడిని నమ్మి ఏ భక్తుడు చెడిపోలేదు. మధ్యలో వారి దేహప్రారబ్ధాన్ని బట్టి కొన్ని కష్టాలు రావచ్చు కాని ఎప్పుడూ వారు గమ్యాన్ని మిస్ అవ్వరు. భగవంతుడిని నమ్మినవారిది సొమ్ము, నమ్మనివారికి దుమ్ము. అందుచేత మీరు శరణాగతిభావన విడిచిపెట్టవద్దు, భక్తిభావన విడిచిపెట్టవద్దు. మీ సొంత ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకోవద్దు. ఆయన ఇష్టమే మన ఇష్టం, ఆయన అయిష్టమే మన అయిష్టం. ఆయన ఏదైతే ఇష్టపడుతున్నాడో అది మీకు ఇష్టమవ్వటం లేదు అనుకోండి, ఇష్టం చేసుకోవటం నేర్చుకోండి. ఇష్టం ఉన్నచోట కష్టం ఉండదు. దేవుడు అంటే ప్రకాశింపచేసేవాడు, ఆయనను నమ్ముకుంటే మనం ప్రకాశింపబడతాము. మీ మనస్సులో వేరుభావన ఉంటే తొలగించుకోండి, స్వార్థం ఉంటే తగ్గించుకోండి. ఈ రెండు ఎప్పుడైతే తగ్గించుకొన్నారో అప్పుడు మీరు పవిత్రులవుతారు. అప్పుడు భగవంతుడిని నాకు కనిపించు అని మీరు అడగనక్కరలేదు. పరమపవిత్రుడికి పురుషోత్తముడైన నారాయణుడు ఎరుక పడతాడు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 29-05-08, గణపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన ఏ మతంలో అయితే పుట్టామో, ఆ మతంలోనే మనం మోక్షం పొందటానికి తగిన సామాగ్రి ఉంది. ఇదంతా విడిచిపెట్టుకొని మీరు మతాల్ని మార్చుకోవద్దు. హిందూమతంలో ఉన్న విశిష్టత మీకు తెలియటం లేదు. ఇది ఒక వ్యక్తిచేత స్థాపించబడిన మతంకాదు. ఇది ఒక సనాతన ధర్మం. మన జీవిత విధానం ఎలా ఉంటే మనం మోక్షం పొందుతామో ఇందులో చెప్పబడి ఉంది. ఏ మహావిష్ణువు అయితే రాముడిగా వచ్చాడో, ఏ మహావిష్ణువు అయితే కృష్ణుడిగా వచ్చాడో ఆయనే వేంకటేశ్వరుడిగా తిరుపతిలో అవతరించాడు. వేంకటేశ్వరస్వామిని అర్చావతారం అంటారు. మనం ఆయనను అర్చించి తరించటానికి వచ్చిన అవతారం. తిరుపతి కొండపైన అందరూ గోవిందనామం చేస్తారు. ఆయన కలియుగదైవం, ఆయన సర్వదేవతా స్వరూపుడు. అందుచేత వేంకటేశ్వరస్వామిని అర్చించేవారి అందరికీ అందరు దేవతలను ఆరాధించిన పుణ్యం వస్తుంది. కలియుగంలో ధర్మం ఒకపాదంతోటే నడుస్తుంది అంటారు

అంటే అధర్మం ఎక్కువగా ఉంటుంది, ధర్మం తక్కువగా ఉంటుంది, అది యుగం యొక్క ప్రభావం. కృష్ణుడు శరీరం విడిచిపెట్టాక కలియుగం ప్రారంభమైంది. అప్పుడు పరీక్షిత్తు ఈ దేశాన్ని పరిపాలించాడు. కలి వచ్చి ఈ దేశాన్ని ఆక్రమించుకోవటం ప్రారంభించింది, పరీక్షిత్తు తరిమివేయటం ప్రారంభించాడు. ఇదేమిటివయ్యా ఈ యుగంనాది, నా యుగంలో నన్ను ఉండనివ్వాలికదా, నేను ఎక్కడికి వెళితే అక్కడనుండి తరిమివేస్తున్నావు, ఎక్కడో చోటు చూపించు అక్కడ ఉంటాను, ఇతర గొడవలకు రాను అని కలి చెప్పాడు. దానికి పరీక్షిత్తు అంగీకరించాడు. ఎక్కడైతే జూదం ఉందో, ఎక్కడైతే పానం ఉందో, ఎక్కడైతే కామము, క్రోధము, లోభము, ఆశ ఇవి ఉన్నాయో ఆ ప్లేసులలో నీవు ఉండవచ్చు అని చెప్పాడు. కామము, క్రోధము, మదము, మోహము, లోభము ఇవి అన్నీ లోపలఉన్న శత్రువులు, బయటఉన్న శత్రువులు కంటే లోపలఉన్న శత్రువులను జయించటం కష్టం. ఏదో కారణం వలన మీరు ధనవంతులు అయిపోయారు అనుకోండి, మీకు తెలియకుండా గర్వం వచ్చేస్తుంది, అంటే కలి వచ్చి మీ మీద దండయాత్ర చేసేస్తాడు. అప్పుడు మీరు ఆపుచేసుకోవటం చాలా కష్టం. ఎంతో ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం, భక్తి ఉంటేనేగాని మనం ఆపుచేసుకోలేము. మీలో ఏదైనా ఒక నేర్పు వచ్చినా దానికి మనకు సంబంధం లేదు, అది మన ప్రారబ్ధాన్ని బట్టి వచ్చింది కాని మన తెలివినిబట్టి రాలేదు.

మనం ఉపాసనలో సక్సెస్ అవ్వాలంటే భక్తి ఒక్కటే సరిపోదు, శ్రద్ధ ఉండాలి. మన మనస్సుకు భక్తి, శ్రద్ధ ఇవి రెండూ పట్టిస్తే మనకు ఉపాసనా ఫలం వస్తుంది, మన ప్రవర్తన ఎలా ఉండాలో మనకు తెలుస్తుంది, ఉపాసన వలన శరణాగతి వస్తుంది. భక్తి అభివృద్ధిలోనికి వచ్చాక నేను, నేను అనం అంతా నువ్వే అంటాము. కొంతమంది ఋషులు వారు తపస్సు చేసుకొని, వారు ధ్యానం చేసుకొని ఆత్మజ్ఞానం పొందుతారు, వారికి లోకం గొడవ ఏమీ ఉండదు. కొంతమంది ఆత్మజ్ఞానం పొందాక, వారు పొందిన అనుభవాన్ని లోకానికి పంచిపెడతారు, వారు మహాత్ములు. భగవంతుడు హృదయనివాసి. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీ అందరి హృదయాలలో అతర్యామిగా ఉండి, ఆ దేహప్రారబ్ధాన్ని బట్టి ఆ దేహాలను ఆడిస్తున్నాను. మీలో అంతర్యామిగా ఉన్న నన్ను పూజించి, గౌరవించి, ఆరాధించి, నన్ను స్మరిస్తూ ఉంటే నా అనుగ్రహానికి పాత్రులవుతారు, శాంతిసామ్రాజ్యానికి అధిపతులు అవుతారు అని పరమాత్మ చెప్పాడు. మీకు వచ్చే ఆలోచనలకు, మీరు చేసే పనులకు సాక్షిగా ఉన్నాను. ఈ జన్మలో మీరు చేసిన దానిని బట్టి రాబోయే జన్మలో శరీరాన్ని ఇచ్చి, అక్కడ మీ హృదయంలో

ఉండి ఆ శరీరం ద్వారా ఏ కర్మానుభవాలు మీకు రావాలో ఆ అనుభవాలు మీకు వచ్చేటట్లుగా మీ శరీరాలను తిప్పతాను అని పరమాత్మ చెపుతున్నాడు. తమోగుణంలో ఉన్నవాడికి, రజో గుణంలో ఉన్నవాడికి అర్థకామాలు ఎక్కువగా ఉంటాయి. మీకు సత్వగుణం సంపాదిస్తే మనస్సు అటువెళ్ళటం తగ్గిపోతుంది. ఈ మూడు గుణాలకు రావణాసురుడి అన్నదమ్ములు ప్రతీకలు. కుంబకర్ణుడు తమోగుణం, రావణాసురుడు రజోగుణం, విభీషణుడు సత్వగుణం. విభీషణుడు సత్వగుణంలో ఉన్నాడు కాబట్టి వాడికి రాముడు దొరికాడు. మిగిలిన ఇద్దరు తమోగుణం, రజోగుణంలో ఉన్నారు కాబట్టి రాముడిని మిస్ అయిపోయారు. మీకు గుణసంపద లేనప్పడు, దైవీసంపద లేనప్పడు భగవంతుడు వచ్చి ప్రక్కన కూర్చొన్న ఆయనను మిస్ అయిపోతారు.

మీకు ఇష్టమైనవి తింటూ ఉంటే మీరు ఎలా ఎంజాయ్‌చేస్తారో అలా గురువుని, దేవుడిని ఎంజాయ్ చేసేవారు చాలా తక్కువమంది ఉంటారు. గురువుని, భగవంతుడిని ముందు ఎంజాయ్‌చేయండి. భగవంతుడినామం స్మరించగానే, ఆయన గుణాలయొక్క వైభవం గుర్తుకు రాగానే ఎవడికయితే ఎంజాయ్‌మెంట్ వస్తోందో వాడికి తరించే రోజులు దగ్గరకు వచ్చాయి అని అర్థం. మనం అందరం కేవలం దేహానికి కంఫర్టు చూసుకుంటాము కాని మనస్సు కంట్రోలు చేసుకోము, అందరిలో ఉన్న బలహీనత యిదే. అందుకే మరణానంతరం మనకు చీకటిలోకాలు మిగులుతాయి. నీమనస్సును నువ్వు నిగ్రహించుకోవాలి. నీమనస్సును అదుపుచేసుకోవటం మానేసి, మనస్సులో ఉన్న రాంగ్‌థింకింగ్‌ను బయటకు గెంటివేయటం మానివేసి ఎవరో వచ్చి నిన్ను ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకొని ఉంటే అది తమోగుణం లక్షణం. మీరు బాగుపడాలి అని ఎవరు వచ్చిమీకు చెప్పాలి, మీ అంతట మీరు ప్రయత్నం చేసుకోండి. ఏరకమైన వికారములు లేనిది బ్రహ్మం, నీమనస్సుకూడా సర్వ వికారముల నుండి బయటపడితే అప్పుడు బ్రహ్మంను పొందుతావు. మనం చెవులతో వినే విషయాలు, కళ్ళతో చూసే విషయాలు అన్నీ నశించిపోతాయని మనకు తెలియటం లేదు. మీ శరీరం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. సాధకులు బహుజాగ్రత్తగా ఉండాలి. మన శరీరం చనిపోయేటపుడు కళ్ళు కాలిపోతాయి, చెవులు కాలిపోతాయి, నోరు కాలిపోతుంది. కాని కళ్ళతో చూసేవాడు, చెవులతో వినేవాడు ఒకడు లోపల ఉన్నాడు, వాడు మాత్రం కాలడు. మరల కొత్త శరీరం వచ్చాక వాడు సిద్ధమవుతాడు, ఈ అలవాట్లు మరల అప్పుడు ప్రారంభమవుతాయి.

అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు

కదా, ఉంటే మరి నాకెందుకు గోచరించటం లేదు అని ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. భగవాన్ ఏమని చెప్పారు అంటే నీ అలవాట్ల యొక్క వేగంలోనుండి, తలంపులయొక్క వేగంలోనుండి ముందు బయటకురా, తరువాత చూడు ఆయన ఉన్నాడో లేడో నీకే తెలుస్తుంది అని చెప్పారు నీలోపల ఉన్న డస్టులో నుండి బయటకు రా, అప్పుడు నీహృదయంలో భగవంతుడు నీకు గోచరిస్తాడు. మాకు ఈమధ్యన కష్టాలు ఎక్కువగా వస్తున్నాయి అని కొంతమంది అంటున్నారు. కష్టాలు అనేవి జీవితంలో ఒక భాగం. మీరు రోజూ ముఖం ఎలా కడుక్కొంటున్నారో, స్నానం ఎలా చేస్తున్నారో, అన్నం ఎలా తింటున్నారో అలాగే జీవితంలో కష్టాలు కూడా వస్తాయి. అవి ఎంత సహజమో కష్టాలు కూడా అంతే సహజం. భగవంతుడికి అన్నీ సాధ్యమే. యిది అసాధ్యం, యిది అసాధ్యం అని మీరు అనుకొన్నది సాధ్యం చేయగలడు వాడు దేవుడు. నీడను చూసి ఆనీడను నేనుఅని ఎవడూ అనుకోడు. ఆనీడను నేను కాదు అనే భావం ఎంత సహజంగా ఉందో ఈ శరీరం నేను కాదు అనే భావన అంత సహజంగా వస్తే అప్పుడు మీరు ప్రకృతి నుండి బయటకు వస్తారు, పునర్జన్మలో నుండి బయటకు వస్తారు, దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి మీమనస్సును అంతర్ముఖం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి, గురువు బోధను అందుకు ఉపయోగించుకోండి.

ఉదయం లేచినది మొదలు రాత్రి పడుకునే వరకూ మనం నేను నాది, నేను నాది అనుకొంటూ ఉంటాము, ఇదే పని మనకు. నేను నాది, ఇవి రెండూ అబద్ధమే, ఇది అంతా పెద్ద మాయ. మనకు జ్ఞానం వచ్చేవరకూ ఇది అంతా అజ్ఞానం అని మనకు తెలియదు. కర్తృత్వం లేకుండా మనం ఏపని చేసినా అది మనలను చుట్టుకోదు. ఇది నేను చేస్తున్నాను, ఇది నావలన అవుతోంది, ఇదంతా నేను సాధించాను అని అనుకొంటే మొత్తం కర్మ అంతా వచ్చి నిన్ను చుట్టుకొంటుంది, అది మరల వేలాది జన్మలకు కారణమవుతుంది. అసలు మాయ రాకూడదుగాని అది వచ్చి కమ్మేసాక అందులోనుండి బయటకు రావటం చాలాకష్టం. మనం ప్రయత్నం చేయాలి, కాలం కలిసిరావాలి, ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిసి వస్తేగాని మాయలోనుండి బయటకు రాలేము. మనం ఇంట్లో పనిచేస్తున్నా, సమాజంలో ఏదైనా పనిచేస్తున్నా డ్యూటీ చేసినట్లుగా చేయాలి గాని అక్కడ మోహం పెట్టుకోకూడదు. ఫలితం ఆశించకూడదు. చేసే పని భగవంతుడికి అర్పించి చేయడమే. పని చేయటం నీ చేతిలో ఉందిగాని ఫలితం నీచేతిలో లేదు. మీ దేహ ప్రారబ్ధంలో ఏదైతే రావాలో మీకోటా భగవంతుడు మీకు ఇచ్చేస్తాడు. అందుచేత భగవంతుడు మీకు ఏదైనా అవకాశములు ఇస్తే

వాటిని భగవంతుని ప్రసాదంగా స్వీకరించు. అది నీవై ఉన్నావు, అది నీవై ఉన్నావు అని వేదం చెపుతోంది, అది నేనై ఉన్నప్పుడు చెప్పడందేనికి అని ఒక ప్లీడరుగారు భగవాన్‌ను అడిగారు. అది నీవై ఉన్నావు ఆమాట రైటే. కాని అది నేను అని నువ్వు అనుకోవటంలేదు, దేహము నేను, మనస్సు నేను, ఇంద్రియములు నేను, సుఖం నేను, దుఃఖం నేను, పుట్టేవాడిని నేను, చనిపోయేవాడిని నేను అని ఇలా అనుకొంటున్నావు. ఇలా అనుకొనే బుద్ధి నీకు ఉంది కాబట్టి ఆ పాడుబుద్ధిని తొలగించటానికి చెపుతున్నారు గాని లేకపోతే ఆ మాటలు చెప్పవలసిన అవసరం లేదు. నీరాంగ్‌థింకింగ్‌లోనుండి మనస్సును మళ్ళించటానికి చెప్పిన మాటలు అవి.

దేహాభిమానం మనిషిని పీడించేస్తుంది. స్థూలదేహం అంటే మనకు బయట కనిపించే ఈ దేహం, సూక్ష్మదేహం అంటే మనస్సు. స్థూల దేహానికి ఆకారం ఉంటుంది, లోపల ఉన్న సూక్ష్మదేహానికి ఆకారం లేదు. మీ మనస్సును నాకు చూపించు అంటే ఎవరూ చూపించలేరు అలాగని మనస్సు లేదని ఎవరూ చెప్పరు. స్థూలదేహం, సూక్ష్మదేహం ఈ రెండు దేహాలతో మీకు అభిమానం కనుక పోతే ఈక్షణంలో మీరు కూర్చున్నవారు నిలబడకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఈ సంతోషాలు దుఃఖాలు, కామాలు క్రోధాలూ ద్వేషాలూ, చావులు పుట్టుకలు ఇదంతా నీలీల. మేము నిత్యాన్ని పట్టుకోలేకపోతున్నాము. నిత్యాన్ని పట్టుకోలేక పోతున్నాము కాబట్టి అనిత్యాన్ని నిత్యం అనుకుంటున్నాము. ఈ లీలలలో కూడా నిన్ను చూస్తూ, నిన్ను ఆరాధిస్తూ ఉంటే నిన్ను పొందుతాము. ఈ మాయలోనుండి, ఈ లీలలో నుండి నిత్యంలోనికి వెళ్ళమని ఇంకొకరు చెపితేగాని నీకు తెలియటం లేదా? మన బుద్ధిని బాగుచేసుకోవాలి అనే ప్రయత్నం చేయటం లేదు. ఒక వేళ మనం దేవుడి దగ్గరకు వెళ్ళినా మనది వ్యాపారభక్తి. ఆభక్తిలో మనకు కోరిక ఉందిగాని పవిత్రత లేదు. భగవంతుడు మనకు ఏది కావాలంటే అది ఇస్తాడు కాని అది కూడా కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది. ఇప్పుడు మనందరం చేయవలసిన ప్రయత్నం ఏమిటి అంటే భగవంతుడి యొక్క లీలలో నిత్యాన్ని దర్శనం చేస్తూ నిత్యంలో ఐక్యమవ్వాలి, అక్కడికి జంప్ చేయాలి, ఆ విద్యను మనం నేర్చుకోవాలి.

నేను పూజ చేస్తున్నాను, జపం చేస్తున్నాను, ధ్యానం చేస్తున్నాను అదంతాపోయిన తరువాత మరల దేహబుద్ధి వచ్చేస్తోంది అని భగవాన్‌తో అంటే ఆయన ఏమి చెపుతున్నారు అంటే దేహాభిమానం వచ్చి మీద పడుతున్నా నీవు సాధన విడిచిపెట్టవద్దు. దేహబుద్ధి దాని అలవాటు అది మాననప్పుడు నీఅలవాటు నువ్వు పోగొట్టుకోవటం ఎందుకు? అది ఒక్క రోజులో పోదు, అభ్యాసం చేస్తూఉండు. అభ్యాసం, వైరాగ్యం వలన నీకు దేహాభిమానం తగ్గుతుంది

అభ్యాసం చేయగా చేయగా ఎటువంటి వాసన అయినా బయటకు పోతుంది. దేహాభిమానాన్ని త్యజించటమే యజ్ఞము, అదే యోగం, అదే తపస్సు అంటున్నారు భగవాన్. దేహబుద్ధిని విడిచిపెట్టటమే నిజమైన దానం. ఆ గడప దాటితే గాని స్వర్గరాజ్యంలో ప్రవేశించ లేవు. మీరు మంచి పనులు చేయండి అని గీతలో చెపుతాడు మంచి పనులు చేయటం ఏదో పుణ్యం వస్తుంది అని కాదు, మంచి పనులు చేసేవాడికి లోచూపు కలుగుతుంది. మంచి ఆలోచనలు వచ్చే వాడికి , పవిత్రమైన తలంపులు వచ్చేవాడికి యూనివర్సల్ లవ్ వస్తుంది. మీఇంట్లో మనుషులను మీరు ఎలా ప్రేమిస్తున్నారో యూనివర్సల్ లవ్ వచ్చినప్పుడు వాడు మొత్తం సృష్టిని అంతా ప్రేమిస్తాడు. ఒక్కజ్ఞానికి మాత్రమే యూనివర్సల్ లవ్వస్తుంది. మీఇంట్లో ఒకరిని ఒకరు ప్రేమించుకొంటున్నారు కదా అది నిజం అనుకోవద్దు, అది నిజం అనుకుంటే మీరు బోల్తాపడతారు, అది ప్యూర్‌లవ్‌కాదు. వారి అవసరాలు వీరికుంటాయి, వీరి అవసరాలు వారికుంటాయి, అలా కాలక్షేపం చేస్తారు, ముసలివారు అయి చనిపోతారు. మీరు ఒకరిని ఒకరు ప్రేమించుకోండి, వద్దనటంలేదు, అది ప్యూర్‌లవ్ కాదు, అది మీరు గ్రహించాలి.

సంకల్పాలు, వికల్పాలు లేనివాడు దేవుడు, సంకల్పాలు వికల్పాలతో కలిసి ఉండేవాడు జీవుడు. రామకృష్ణుడు ఏమిచెప్పాడంటే ఆజీవుడి గొడవ నీకు ఎందుకు, వాడి గుణాల గొడవ నీకు ఎందుకు, ఆ జీవుడిలో ఉన్నదేవుడిని చూస్తూ ఆయన దగ్గరకు వెళ్లిపో, వీళ్లగొడవ దగ్గర ఆగిపోతే ఇలాగే ఉండిపోతావు. మీరు విసుగు వచ్చేలాగ సబ్జక్టు శ్రవణం చేయాలి. అలా శ్రవణం చేయగా చేయగా లోపల ఏదో వస్తువు ఉంది, అది మనకు తెలియటంలేదు, మన ఇంద్రియాలకు అందటం లేదు కాని ఏదో ఉన్న మాట నిజం అని మనకు ఎప్పడయినా స్ఫురిస్తుంది. ఆ స్ఫురణ నిలబడదు, వాసనలు నిలబడనివ్వవు. వాసనాక్షయం అయితేగాని ఆ స్ఫురణ పెర్మనెంట్‌గా నిలబడదు. ఆస్ఫురణ ఎందుకంటే ఎప్పటికయినా దానిని మనం పట్టుకొవాలనే బుద్ధి మనకు కలగటంకోసం. అదిగూడా ఈశ్వరుని దయ. మిమ్మల్ని అనుగ్రహించటానికి లోపల పరమేశ్వరుడు సిద్ధంగా ఉన్నాడు. ఆయన తాలూక సుఖాన్ని, శాంతిని మీ సహస్రారంలోనికి కొద్దికొద్దిగా విడిచిపెడుతూ ఉంటాడు. ఒక్కసారి విడిచిపెడితే ఆ సుఖాన్ని, శాంతిని తట్టుకోలేక మీరు ఉక్కిరిబిక్కిరై పోతారు. మీకు కొన్ని సుఖాలు తెలుసు కాని ఆసుఖం మీరు ఊహించే సుఖాల లాగ ఉండదు. ఎట్టి సుఖం మీకు అనుభవంలోనికి వచ్చాక దానితోటి సమానమైన సుఖం కాని, దానికి మించిన సుఖంకాని లేదని మీకు తెలుస్తుందో అట్టి సుఖస్థానాన్ని పొందటానికి ప్రయత్నంచెయ్యి అని పరమాత్మ గీతలో చెప్పాడు.

# క్షమా గుణం - తల్లి లాంటిది

తల్లి బిడ్డను ఎలా కాపాడుతుందో అలాగే ఈ సృష్టికి కర్త అయిన ఈశ్వరుడు అందరి క్షేమాలను చూస్తున్నాడు అనే క్షమాగుణంతో అపకారాన్ని ఓర్చుకొంటూ జీవిస్తే ఆధ్యాత్మిక జీవితం సాధ్యమౌతుంది. పెను తుఫాను మహావృక్షాల వేళ్లతో పెకలించు కొనిపోతాయి. కాని గడ్డిపూచను అది ఏమీ చెయ్యలేదు. అది అణకువ యొక్క గొప్పదనం. నదిలో స్నానం చేసేవాడు తలవంచకపోతే తల మురికిగానే ఉంటుంది. సాధకుడు ఇతరుల కెవ్వరికీ తలవంచనంటే తన అజ్ఞాన నాశనానికి అంగీకరించటం లేదని అర్థం. ఆరడుగుల మనిషి నాల్గు అంగుళాల నాలిక ద్వారా వచ్చే మాటకు కృంగిపోతాడు. ఎవరైనా అన్యాయంగా దూషిస్తే సాధకుడు అనేవాడు తనను పరీక్షించటానికి భగవంతుని యొక్క నాటకమని గ్రహించాలి. వినయ భావంతో ఉంటే ధ్యాన ఫలితం పొందినట్లే. బుద్ధుణ్ని ఒక మతోన్మాది మొఖం మీద ఉమ్ము వేసి నోటికి వచ్చినట్లు అన్ని తిట్టినా చెలించకపోవటంతో మరలా ఇలా అంటాడు "నేను నిన్ను బూతులు తిడుతున్నాను వినబడటం లేదా?" అంటే "నీవు అన్నవి అన్నీ విన్నాను నా హృదయంలోకి తీసుకోలేదు బదులు చెప్పేది లేదు. రేపు ఇదే సమయానికి ఈ మార్గం ద్వారా వెడతాను ఇంకా తిట్టేవి ఉంటే ఆలోచించి తిట్టు. నీవు తిడితే బాధపడేవాడు ఏనాడో చనిపోయాడు" అనగా మరుసటి రోజు ఆ వ్యక్తి బుద్ధుడికి క్షమాపణ చెప్పాడు. శ్రీనాన్నగారు "అనుకూలంగా నమ్రత భావంతో విషయాన్ని తెలిపి సమాజాన్ని మార్చగలం గాని వ్యతిరేకంగా మాట్లాడి మార్చలేము" అన్నారు. చెట్టును ఒక మనిషి నరికివేస్తున్నా కూడా వానికి నీడను ఇస్తుంది. సాధకుడు క్షమాగుణంతో ఉంటే అన్ని శుభాలు వచ్చేస్తాయి. తనను హింసించే వ్యక్తుల శ్రేయస్సు గురించి ప్రార్థన చేసే వానిని మాత్రమే సాధకుడు అనగలము. ఏసు చిత్ర హింసలకు గురియై కూడా ఇలా అంటాడు "తండ్రి వీరు ఏమి చేస్తున్నారో వీరికి తెలియటం లేదు. వీరిని క్షమించు" అని. గతంలో గొప్ప గొప్ప సాధనలో ఉన్నవారు, గురు అనుగ్రహంలో ఉన్నవారికి తప్ప మరి ఎవ్వరికీ సహనమబ్బుట సాధ్యం కాదు, చాలా కష్టం. "అణిగిమణిగి ఉన్నవాడే అందరిలోకీ ఘనుడు" అన్నాడు తుకారామ్. అణకువ ఉన్న శిష్యునికీ గురువు దీవెనలు వాటంతట అవి వస్తాయి. శారదామాత అంతిమ ఘడియలలో "సహనం - సహనం - సహనం" అన్నారు. ప్రకృతి ప్రళయాలలోను, ప్రారబ్ధ కర్మల్లోనూ ఓర్పుగా జీవించాలని అర్థం. అదే వారికి శ్రీరామరక్ష.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగష్టు | 18 | కైకలూరు టిటిడి కళ్యాణ మండపం |
| ఆగష్టు | 22 | చింతపర్రు సాయిబాబా మందిరం |
| ఆగష్టు | 26 | ఆకివీడు దత్తాత్రేయ మందిరం |
| సెప్టెంబర్ | 01 | ఐ. భీమవరం |
| సెప్టెంబర్ | 10 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| సెప్టెంబర్ | 23 | హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ, సత్యసాయి మండపం (సద్గురు శ్రీ నాన్నగారి పుట్టినరోజు) |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## మంచి మాటల నాన్నగారు

**నా** రాయణుడు నరుడులోనే వున్నాడని - వె

**న్న** లాంటి వాక్యాలను లౌక్యంగా చెబుతూ, ప్రతి పదాన్ని నేతి

**గా** రెలా వి(తి)నిపించే వాగ్ధాటిగా

**రు** జువు చేసిన మనుజుడు. మనీషి....


**శ్రీ నాన్నగారు**

మీ పదాలకు, పాదాలకు నమస్కరిస్తూ

**బొమ్మిన వెంకట రమణ,** రచయిత

## ❊❊❊❊❊ గమనిక ❊❊❊❊❊

మీ చందా గడువు **ఈ నెలతో** ముగియుచున్నది. కావున మీ చందాను **2008-09** సంవత్సర కాలానికి **రు॥ 150/-**లను స్వయంగాగాని, డిడి రూపంలో గాని పంపి **రెన్యువల్** చేయించుకోవలసినదిగా కోరడమైనది.



సద్గురు శ్రీ నాన్నగారితో శ్రీ గణేశన్‌గారు